క్లుప్తంగా

వివాదాలు సృష్టిస్తే చర్యలు తప్పవు: ఎస్‌ఐ సుధాకర్



మైలవరం: మైలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి వివాదాలు జరిగినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సుధాకర్ హెచ్చరించారు. మైలవరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత, వివాదాలకు కారణమైన వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మైలవరంలో ఎటువంటి తగాదాలకు వెళ్లకుండా ఉంటామని యువత చేత ప్రమాణం చేయించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే భవిష్యత్‌లో కేసులు తొలగిస్తామని ఎస్‌ఐ చెప్పారు.

ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్ పరం చేస్తే సహించం

ఎన్‌ఎంయూఏ నాయకుల హెచ్చరిక



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్‌పరం చేయాలని ప్రభుత్వం చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. విజయవాడ గవర్నర్‌పేట 1, 2 డిపోల ఆర్టీసీ సంస్థ స్థలాలు లులూ ప్రైవేటు సంస్థకు ఇవ్వాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా రెండో రోజు ఆదివారం యూనియన్ నేతలు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ స్థలాలను కాపాడాల్సిన ప్రభుత్వమే తాకట్టు పెట్టేందుకు ప్రయత్నించడంపై వారు మండిపడ్డారు. డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బీఎస్ రావు, ఎంసీహెచ్ మోహన్, గ్యారేజ్ కార్యదర్శి కోటేశ్వరరావు, అధ్యక్షులు శంకర్, వధూద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బధిరుల బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



నాగుర్‌పాషా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయ బధిరుల బ్యాడ్మింటన్ ఛాంపియన్స్ షిప్ పోటీల్లో ఎన్టీటీపీఎస్‌కు చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నాగుర్ పాషా రన్నరప్‌గా నిలిచాడు. చెన్నై రాయపేటలో వెస్లీ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ చాంపియన్ షిప్ ఫైనల్ పోటీలో నాగుర్‌పాషా ద్వితీయస్థానంలో నిలిచాడు. కొండపల్లికి చేరుకున్న ఆయనకు ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పెట్రోల్ బంకులు ప్రారంభం



చాట్రాయి: మండలంలోని పోలవరం, తుమ్మగూడెం గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘాలు నూతనంగా నిర్మించిన పెట్రోల్ బంకులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎన్.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ముసునూరు: సీఐటీయూ మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైందని జిల్లా నేత జి.రాజు తెలిపారు. గ్రామంలో ఆదివారం సీఐటీయూ మహాసభ నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. అనంతరం పది మంది సభ్యులతో కూడిన సీఐటీయూ మండల నూతన కమిటీని నియమించారు. మండల కన్వీనర్‌గా కొడవలి శ్రీనివాస్, కో–కన్వీనర్లుగా కనకదుర్గ, విద్యావతి, సునీత తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ, ముఠా వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

చిల్లబోయినపల్లిలో త్రైత సిద్ధాంత ప్రచారం

ముసునూరు: ఆచార్య ప్రబోధానంద విరచిత బోధనలు ఆచరణీయమని ఆ సమితి నూజివీడు అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక నూజివీడు విభాగం ఆధ్వర్యంలో ఆదివారం చిల్లబోయినపల్లి యాదవ బజారులో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ఇందు ధర్మ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, అశోక్, రామాంజనేయులు, వంశీ, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలపై కూటమి చిన్నచూపు

- వైద్య పరికరాలు లేక ఇబ్బందులు
- రోగులకు అందని వైద్యం
- వైద్యశాలకు ముళ్ల చెట్లతో దడి ఏర్పాటు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ల్యాబ్‌లో పరికరాలు, ఫర్నిచర్, సరిపడా మందులు లేకపోవడంతో రోగులకు వైద్యం అరకొరగా అందుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 72 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులను ఉచితంగా అందించేందుకు 2021లో ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో రూ.1.60 కోట్లతో రెండు వైద్య శాలలను నిర్మించింది. గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు ఇబ్రహీంపట్నం యూపీహెచ్‌సీ నీట మునిగింది. ల్యాబ్‌లో పరికరాలు, ఫర్నిచర్ పాడయ్యాయి. నెలలు గడుస్తున్నా పరికరాలు, సరిపడా మందులు సమకూర్చలేదు. కొండపల్లి వైద్యశాలకు ప్రహరీ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మరింది.

ఏడాది అయినా అందని ల్యాబ్ పరికరాలు..

పేదల ఆరోగ్యమే లక్ష్యంగా ఇబ్రహీంపట్నంలో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం గత ఏడాది ఆగస్టు నెలలో కృష్ణానది వరద ముంపునకు గురైంది. సుమారు 10 అడుగుల మేర వరద నీరు చేరడంతో ఫర్నిచర్, మందులు, వివిధ రకాల వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించే పరికరాలు నీటిమునిగి పనికిరాకుండా పోయాయి. వైద్యశాలలో పరికరాలు లేక ఏడాది కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఇబ్రహీంపట్నంతో పాటు పరిసర ప్రాంత రోగులు మధుమేహం, బీపీ, హిమోగ్లోబిన్, రక్తహీనత, కిడ్నీ, లివర్, కొలెస్ట్రాల్, మల,మూత్ర, తదితర 72 రకాల వైద్య పరీక్షలకు దూరమయ్యారు.



కొండపల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ముళ్ల కంచెతో ఏర్పాటు చేసిన దడి



ఇబ్రహీంపట్నం యూపీహెచ్‌సీలో బయట పడేసిన వరదకు పాడైన ఫర్నిచర్

కొండపల్లి వైద్యశాలకు ముళ్ల కంచెతో దడి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.80 లక్షలతో కొండపల్లిలో హైవే పక్కన నిర్మించిన వైద్యశాలకు ప్రహరీ లేక మందుబాబులకు అడ్డాగా మారింది. కిటికీ అద్దాలు ధ్వంసం చేసే పరిస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం వైద్యశాలకు ప్రహరీ నిర్మించలేక ముళ్ల కంచెలతో దడి ఏర్పాటు చేశారు. ప్రభుత్వ తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. సుమారు 50–60 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు రక్షణగా వేసుకునే ముళ్లకంచే చూసి కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

యూపీహెచ్‌సీలతో నెరవేరని లక్ష్యం

పట్టణ ప్రాంతాల్లో గర్భిణుల నెలవారీ వైద్యం, మాతా శిశు మరణాలు తగ్గింపు దీర్ఘకాలిక వ్యాధులు మధుమేహం, బీపీ, క్షయ, టీబీ, థైరాయిడ్, పక్షవాతం తదితర వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు, మందులు సకాలంలో అందించే లక్ష్యంతో యూపీహెచ్‌సీలు నెలకొల్పారు. ఇన్, అవుట్ పేషెంట్, రక్త పరీక్షలు, ఫార్మశీ, కాన్పుల గదులు, అధునాతన పరికరాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వ తీరుతో ల్యాబ్‌లో పరికరాలు లేక ఏడాదిగా రోగులకు వివిధ రకాల వైద్య సేవలు, రక్త పరీక్షలు అందడం లేదు. ప్రస్తుత ప్రభుత్వ విధానంతో వైద్యశాలల లక్ష్యం నీరుగారుతోంది.

ప్రహరీ కట్టలేని స్థితిలో కూటమి ప్రభుత్వం



గత ప్రభుత్వం నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రానికి కూటమి ప్రభుత్వం ప్రహరీ నిర్మించలేని స్థితిలో ఉంది. పూర్వం గ్రామాల్లో ఇళ్ల రక్షణకు కట్టుకునే ముళ్ల కంచెలు ఏర్పాటు చేసి నవ్వుల పాలవుతోంది. చారిత్రక నేపథ్యం కలిగిన కొండపల్లి పీహెచ్‌సీపై ప్రభుత్వం తీరు, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోంది.

– గుంజా శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్, కొండపల్లి

పరికరాలు లేకుండానే వైద్యం



గాజులపేట యూపీహెచ్‌సీలో వరదకు పాడైన వైద్య పరికరాలు ఏడాదిగా సమకూర్చ లేదు. వైద్య పరికరాలు లేకుండా రోగులకు వైద్య పరీక్షలు ఎలా జరుపుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం గాలికి వదిలివేసినట్లు ఉంది. పేదలకు సరైన వైద్యం అందించలేని ప్రభుత్వం సువర్ణపాలన అంటూ పట్టణంలో తిరగడం చూసి ప్రజలు నవ్వుతున్నారు.

– కుంచెం జయరాజు, ఇబ్రహీంపట్నం

కూటమి మోసాలను ప్రజలకు వివరించండి

మాజీ మంత్రి జోగి రమేష్



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న జోగి రమేష్

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఎన్నికైన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ పేర్కొన్నారు. కేతనకొండ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి జోగి రమేష్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిశారు.

నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మొగులూరు రవి, సయ్యద్ జానీలను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కూటమి ప్రభుత్వ మోసాలు, అబద్ధపు హామీలు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. గ్రామ సర్పంచి నళిని ఆశాలత, ఎంపీటీసీ సభ్యుడు సువర్ణరాజు, కో–ఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్‌మీరా, సీనియర్ నాయకులు మేడపాటి నాగిరెడ్డి, గరికపాటి రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు మోసాలను ఎండగడదాం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న స్వామిదాసు, నాయకులు

తిరువూరు: ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంపై పార్టీ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో జరిగింది. స్వామిదాసు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు ప్రజలకిచ్చిన హామీలతో పాటు చేయని వాగ్దానాలను కూడా అమలు చేసిందని చెప్పారు. గత ప్రభుత్వం కంటే రెట్టింపు సంక్షేమ పథకాలను అందిస్తామని హామీలిచ్చి, ఇంటింటికీ బాండ్లు కూడా ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి అమలులో ఏరు దాటాక తెప్పతగలేసిన చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకమైన తల్లికి వందనం కూడా అరకొరగానే మంజూరు చేయడాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని, సమస్యలను పక్కదోవ పట్టించడానికే వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని స్వామిదాసు ధ్వజమెత్తారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు సుధారాణి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, మైనారిటీ, ట్రేడ్ యూనియన్స్, వాణిజ్య విభాగం, లీగల్ సెల్ నాయకులు షేక్ జాకీర్, యరదేశి రామారావు, దేవిశెట్టి బాలకృష్ణ, రేగళ్ల మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు వాళ్ళ సురేష్, తిరుమలశెట్టి వేణు, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, షేక్ నదియా, ఇనపనూరి చిన్నారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు.

గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యం



మాదు జయ రాంబాబును సన్మానిస్తున్న నాయకులు

జి.కొండూరు: జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యమని నియోజకవర్గ బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు మందా మధుబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ ఆదేశాల మేరకు మందా మధుబాబు ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మండల బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడిగా మాదు జయ రాంబాబుని ఆదివారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు చాట్ల రాబర్ట్, వరప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ రైతు, పంచాయతీ రాజ్ విభాగం కన్వీనర్లు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, పసుపులేటి రమేష్, రెడ్డిగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' సామాజిక చైతన్యానికి స్ఫూర్తి

నూజివీడు: దేశంలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న అనేక కళలను, వ్యక్తుల ప్రతిభా పాటవాలను బాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా ప్రాచుర్యం కల్పిస్తున్న ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం సమ సమాజ స్ఫూర్తికి అద్దం పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ (తపన) చౌదరి అన్నారు. నూజివీడులో ఆదివారం మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ మనసులోని మాట సమాజ చైతన్యానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లెపూడి నాగరాణి, ఏఎంసీ చైర్మన్ కుంపటి అరుణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జీఆర్‌కే రంగారావు, జిల్లా నాయకులు బోను అప్పారావు, శివరాజు వసుంధరదేవి పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారించాలి

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని, కోళ్లు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మరోసారి ఉద్యమం

వామపక్షాల నాయకుల హెచ్చరిక



సమావేశంలో చర్చిస్తున్న వామపక్షాల నాయకులు

నూజివీడు: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేకుంటే వామపక్ష పార్టీలు మరోసారి విద్యుత్ ఉద్యమం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. నూజివీడులోని అమర్ భవనంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన వివిధ వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ఆగస్టు 5వ తేదీన జరుగనున్న ధర్నా కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు చెప్పిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన చేస్తున్నారని విమర్శించారు. ఏడాది పాలనలోనే రాష్ట్ర ప్రజలపై రూ. 15,800 కోట్ల విద్యుత్ భారాన్ని మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, సీపీఎం నూజివీడు మండల కార్యదర్శి పాలేటి సుభాష్ చంద్ర బోస్, నాయకులు చెంగల వెంకటేశ్వరరావు, యాదాల సురేష్, అబ్బదాసరి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

యువత భవిత కోసం తపించిన అబ్దుల్ కలాం

వర్ధంతి కార్యక్రమంలో నివాళి



రెడ్డిగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మైలవరం: మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యువత భవిత కోసం కలాం తపించారని చెప్పారు. భారతదేశ రక్షణ రంగాన్ని అగ్ర భాగంలో నిలిపారని కొనియాడారు. మైలవరం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శులు కుప్పిరెడ్డి వర ప్రసాదరెడ్డి, చాట్ల రాబర్ట్, నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షుడు పసుపులేటి రమేష్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు మందా మధుబాబు, రెడ్డిగూడెం, రంగాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, బొల్లారెడ్డి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో డ్రెయినేజీలు



డ్రెయినేజీ ఆక్రమణలతో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు (ఫైల్)



మెయిన్ రోడ్డులో ధ్వంసమైన రహదారి



ఆగిరిపల్లి మెయిన్ రోడ్డులో కనిపించని డ్రెయినేజీ కాలువలు

ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో గత కొన్నేళ్లుగా దుకాణదారులు డ్రెయినేజీ కాలువలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారింది. దీంతో వర్షాలు పడినప్పుడు మెయిన్ రోడ్డు చెరువును తలపిస్తోంది. ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి ఇరువైపులా విజయవాడ రోడ్డులోని రామాలయం వరకు డ్రెయినేజీ కాలువను దుకాణదారులు ఇష్టానుసారంగా ఆక్రమించి సిమెంట్ కట్టడాలు కట్టి, వీధి వ్యాపారులకు అద్దెకి ఇస్తున్నారు. వర్షాలు పడినప్పుడు కొండపై నుంచి వచ్చిన వర్షం నీరు వెళ్లే దారి లేక మొత్తం మెయిన్ రోడ్డుపై నిలవడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి వ్యాపారుల వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రంగా ఉంటోంది. డ్రెయినేజీ ఆక్రమణలపై పంచాయతీ, ఆర్ అండ్‌బీ శాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ప్రధాన రహదారిలో ఉన్న డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయలేదని, దీంతో తీవ్ర దుర్గంధంతో పాటు దోమల బెడద బాగా ఎక్కువైందని చెబుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి ఆగిరిపల్లిలోని డ్రెయినేజీ కాలువలను ఆక్రమణ చెర నుంచి తప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు

చర్యలు తీసుకుంటాం

ఆగిరిపల్లిలో దుకాణదారులు డ్రెయినేజీ కాలువలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్‌డీ ఆనంద్‌బాబు తెలిపారు. డ్రెయినేజీ ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తామని, ఒకవేళ తొలగించకపోతే సిబ్బందితో ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు.

ఘనంగా రిజర్వేషన్ డే వేడుకలు

నందిగామటౌన్: స్థానిక బహుజన సేవా సమితి కార్యాలయంలో ఆదివారం రిజర్వేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ మాట్లాడుతూ 1902లో ఛత్రపతి సాహూ మహరాజ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బహుజన సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రతిపాటి సూర్యం, ఉపాధ్యాయ సంఘ నాయకులు కామా ప్రభాకర్, పారా సురేష్, జాషువా ఫౌండేషన్ కోట రవీంద్రనాథ్, నాయకులు యర్లగొర్ల ఉదయ్ కిరణ్, కామా బాబురావు తదితరులు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. క్రమశిక్షణతో చదవాలని సూచించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి తిరువూరు నుంచి ఆగస్టు 7వ తేదీన ప్రత్యేక బస్సు నడుపుతామని ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం తెలిపారు. తిరువూరులో సాయంత్రం 6 గంటలకు ఈ బస్సు బయలుదేరి 8వ తేదీ ఉదయం కాణిపాకం చేరుతుందన్నారు. అనంతరం శ్రీపురం మీదుగా అరుణాచలానికి ఈ బస్సు చేరుకుంటుందని చెప్పారు. భక్తుల గిరిప్రదక్షిణ అనంతరం 9వ తేదీ కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి మీదుగా 10వ తేదీ రాత్రి తిరువూరు చేరుతుందన్నారు. తిరువూరు నుంచి ఈ బస్సులో ఒక్కొక్కరికి రూ.2,800 టికెట్ ధర నిర్ణయించామని చెప్పారు. ఆన్‌లైన్లో టికెట్లు రిజర్వు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు 73824 87969, 98856 61835 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచే ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు శ్రావణ మాసం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారు మల్లెపూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ నిర్వహించిన అమ్మవారి రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



సుధాకర్ (ఫైల్)

జి.కొండూరు: బైకుపై వెళ్తూ అదుపుతప్పి కిందపడిపోయిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చెవుటూరు గ్రామానికి చెందిన బీమన సుధాకర్ (31) మైలవరంలో బైకు మెకానిక్ షెడ్డును నిర్వహిస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన షెడ్డు వద్ద పని ముగించుకొని తన బైకుపై ఇంటికి వస్తున్న సుధాకర్, చెవుటూరు గ్రామ శివారులోకి రాగానే బైకు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయాలైన సుధాకర్‌ని స్థానికులు 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సిఫార్సు మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి బీమన రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నూజివీడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అధికారులు అంతా అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను అందించవచ్చన్నారు.